ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర మాసం దీక్షలు, ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. రంజాన్ పండగను అధికారికంగా ప్రకటించిన ఘనత కేసీఆర్‌దని, ప్రతి యేటా పేద ముస్లింలకు తోఫాలు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 31 మార్చి 2025 | www.navatelangana.com

గ్రూప్ 1లో 17వ ర్యాంకు సాధించిన ప్రణయ్ సాయి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉత్తమ ర్యాంకులు



నవతెలంగాణ-తూప్రాన్

ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన గ్రూప్-1లో ఫలితాలలో పట్టణానికి చెందిన ప్రణయ్ సాయి 17వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన బోయినపల్లి శ్రీవిద్య విష్ణువర్ధన్ దంపతుల కుమారుడు బోయినపల్లి ప్రణయ్ సాయి ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశాడు. అప్పటినుండి నిర్విరామంగా కష్టపడుతూ శ్రమిస్తూ నిరంతరం వివిధ రకాల పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ చేస్తూ పరీక్షలు వ్రాశాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్స్ పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ విజయం సాధిస్తున్నాడు. గ్రూప్- 4 ఫలితాలలో 42వ ర్యాంకు సాధించి చేగుంట తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా, గ్రూప్-2 ఫలితాలలో 134 ర్యాంకు, గ్రూప్-3 ఫలితాలలో 148 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పప్రణయ్ సాయి మాట్లాడుతూ తన విజయంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.



సీఎం సహాయ నిధి కోసం ఎదురు చూపులు

- రాష్ట్ర సరిహద్దు ప్రాంత ప్రజలకు తప్పని తిప్పలు
- గతంలో ఎన్నడూ లేని విధంగా జాప్యం
- పట్టించుకోని వైద్య శాఖ మంత్రి !

నవతెలంగాణ-జహీరాబాద్

గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న ప్రజలకు సీఎం సహాయ నిధి సాయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్నేండ్ల నుంచి ఒక్క రూపాయి కూడా ఈ ప్రాత ప్రజలకు సాయం అందలేదు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత కూడా.. నేటి వరకు సరిహద్దు ప్రజలకు సీఎం సహాయ నిధి చేయలేదు. సరిహద్దులో ఉండడంతో కర్నాటక, మహారాష్ట్రలో ఇక్కడి ప్రజలు అత్యవసరమైతే శస్త్ర చికిత్సలు చేయించు కుంటారు. అయితే అలాంటి వారికి సీఎం సహాయ నిధి అందడం లేదని పలువురు వాపోతున్నారు.

ప్రధానంగా జహీరాబాద్, నారాయణఖేడ్, బోధన్, నిజామాబాద్, బాన్సువాడ నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంత ప్రజలు అత్యవసర సమయాల్లో కర్నాటక, మహా రాష్ట్రల్లోని వైద్యశాలల్లో శస్త్ర చికిత్సలు చేసుకుంటారు. జహీరాబాద్ నుంచి బీదర్ కేవలం 20 కిలోమీటర్లు మాత్రమే ఉండడంతో.. జాతీయ రహదారి 65పై జరిగిన రోడ్డు ప్రమాద క్షతగాత్రులను, ఛాతినొప్పి హార్ట్‌ఎటాక్ లాంటి అత్యవసర రోగులను బీదర్ జిల్లా కేంద్ర వైద్యశాలకు లేదా బీదర్‌లోని మల్టీ స్పెషాలిటీ ప్రైవేటు వైద్యశాలలకు తీసుకెళ్తారు. రోగి పరిస్థితులను బట్టి ఆయా నియోజక వర్గాల్లోని వైద్యులు తమకు దగ్గరగా ఉన్న సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకే రెఫర్ చేస్తారు. ఈ క్రమంలో అతస్యరం ఉండడంతో అక్కడే శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ట్రస్టెడ్ వైద్యశాలలు కూడా ఎక్కువగా ఉండడంతో తక్కువ ఖర్చులతో శస్త్ర చికిత్సలు చేస్తారు. దాంతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఎక్కువ మంది రోగులు ఆయా రాష్ట్రాలకే శాస్త్ర వెళ్తుంటారు.

వేలల్లో దరఖాస్తులు పెండింగ్..

ముఖ్య మంత్రి సహాయ నిధికోసం ఈ ప్రాంతం నుంచి పెట్టుకున్న వేల దరఖాస్తులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. అత్యవసర సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి చికిత్స తీసుకున్న వారికి వెంటనే సీఎం సహాయ నిధి వర్తింప చేయాలని జహీరాబాద్, నారాయణఖేడ్, బోధన్, నిజాంబాద్ ప్రాంతాలకు చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్టు సమాచారం. అయినప్పటికీ నేటికీ కూడా ఒక బిల్లు కూడా చెల్లించకపోవడంతో సదరు రోగులు ఆర్థి కంగా కృంగిపోతున్నారు.

ఆన్‌లైన్ విధానంతో అన్ని సమస్యలే...

ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకునేందుకు శాసనసభ్యుడికి, అధికార పార్టీకి చెందిన శాసనసభ్యులు లేని నియోజకవర్గంలో ఏదైనా కార్పొరేషన్ చైర్మెన్లు ఉంటే వారికి.. లేదా జిల్లా ఇన్చార్జి మంత్రి సాయంతో ఇతర నాయకులు బిల్లులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆన్లైన్ చేసిన వాటికి ముఖ్యమంత్రి నేరుగా తమ సహాయ నిధి నుండి డబ్బులు చెల్లిస్తున్నారు. కొన్ని చెక్కులు ఆయా నియోజ కవర్గ శాసనసభ్యులకు ఇవ్వగా కొన్నింటిని అధికార పార్టీకి చెందిన నాయకులకు సైతం అందజేయడంతో వారు తమ నియోజకవర్గంలోని రోగులకు, క్షతగాత్రులకు అందిస్తు న్నారు. అయితే ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాత ఇతర రాష్ట్రాలకు చెందిన బిల్లులను ఆన్‌లైన్‌లో యాక్సెప్ట్ చేయకపోవడంతో ఎలా దరఖాస్తు చేసుకోవాలని సరిహద్దు ప్రాంతాల ప్రజలు బిల్లులు పట్టుకొని శాసనసభ్యుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై స్థానిక శాసనసభ్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహను సైతం కలసి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ మంత్రి సైతం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు ఇతర రాష్ట్రాల్లో శస్త్ర చికిత్సలు చేసుకోగా.. వారికి సీఎం సహాయ నిధి వెంటనే అందజేశారని.. అలాంటిది తమకు ఎందుకు ఇవ్వట్లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తే.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇంతవరకు అమలు జరగలేదన్నారు. వచ్చే బిల్లుల కంటే ఎక్కువ తాము శాసనసభ్యుల కార్యాలయాలకు వారి చుట్టూ తిరగడానికే ఖర్చు ఎక్కువగా అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరిహద్దు నియోజకవర్గాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు ఏర్పాటు చేయాలి

-ఎమ్మెల్యే మాణిక్‌రావు

సరిహద్దు ప్రాంతంలో శాసనసభ నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను ఏర్పాటు చేయాలి. అన్ని విధాల చికిత్సలను ప్రభుత్వపరంగా అందించాలి. నా నియోజకవర్గంలో కూడా చాలామంది రోగులు కర్నాటక, మహారాష్ట్రలకు వెళ్లి శస్త్ర చికిత్సలు చేసుకుని బిల్లులను అందిస్తున్నారు. కానీ ఆన్‌లైన్ విధానం పెట్టిన అనంతరం అందులో ఇతర రాష్ట్రాలకు చెందిన వైద్య బిల్లులు ఏవీ కూడా యాక్సెప్ట్ చేయట్లేదు. దాంతో బిల్లులన్నీ మా వద్దనే పెండింగ్లో ఉంటున్నాయి. అలాంటి వారికి మాన్యువల్ బిల్లులతోనైనా చెల్లించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. మా ప్రభుత్వ హాయంలో ఏ రాష్ట్రంలో ఎక్కడ చికిత్స చేసుకున్నా.. అత్యవసర పరిస్థితుల్లో ఎల్‌ఓసీలను, ముఖ్యమంత్రి సహాయ నిధులను అందజేశాం.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఉగాది పండుగ సందర్భంగా షడ్రుచులతో అందరూ సుఖ సంతోషాలతో బాగుండాలని, ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలందరికీ లాభం జరిగే విధంగా కార్యక్రమాలు జరగాలని భగవంతుడు ఆశీర్వచనం ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు. పాడి పంటలతో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు లేకుండా అందరూ సుఖంగా బతకడానికి ఈ ఉగాది పర్వదినాన ప్రతి ఒక్కరు పూజలు చేసుకొని ఆశీర్వచనం పొందాలన్నారు. ఉదయం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ చేశారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఉదయం నడకతో వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి , సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మెన్ బంక చందు, చిత్తరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





మండలంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు

- మంజూరీ పత్రమందజేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి
- హర్షం వ్యక్తం చేసిన మండల కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ నియోజకవర్గంలో నూతన బీఎస్సీ వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలోని గాగీల్లపూర్ గ్రామ శివారులో నూతన వ్యవ సాయ కళాశాలను నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసింది. నూతన వ్యవసాయ కళాశాల మంజూరీ పత్రాన్ని ఆదివారం ఉగాది సందర్భంగా నియోజకవర్గ ప్రజా భవన్ యందు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల కాంగ్రెస్ శ్రేణులకు అందజేశారు.

ప్రారంభమైన భూసేకరణ ప్రక్రియ

మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులో నూతన వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించినట్టు అధికారులు సూచనప్రాయంగా వెల్లడించారు.



కాంగ్రెస్ శ్రేణుల హర్షం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండలానికి నూతన వ్యవసాయ కళాశాలను మంజూరీ చేయించడం ఆనందనీయమని ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ, మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బైరి సంతోష్, పలువురు మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ కళాశాలను మంజూరీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లికి కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

కాళేశ్వరం నీళ్లతో కరువును పారద్రోలాం

- కొండేంగుల కుంట పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

కాళేశ్వరం నీళ్లతో కరువును పారద్రోలామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలంలోని మైలారం కొండేంగుల కుంటలో పెద్దమ్మ దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఘనంగా ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని, ఈ ప్రాంతం కరువుతో ఉండేదని, కాళేశ్వరం జలాలతో కరవును పారద్రోలామన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఈ యాసంగి లక్ష ఎకరాలకు సాగు నీరు ఇచ్చామంటే కాళేశ్వరం పుణ్యమన్నారు. పెద్దమ్మ ఆశీస్సులు మన అందరి పైన ఉండాలని, పాడి పంటలు పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.

శ్రీరామ నవమికి రావాలని హరీష్ రావుకి ఆహ్వానం

పట్టణంలోని పాత గంజి (కూరగాయల మార్కెట్)లోని శ్రీశ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయ సప్తమ వార్షికోత్సవం, శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుని కలసి ఆలయ నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీరామ నవమికి రావాల్సిందిగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వార్షికోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.



మంచు కొండల్లో సిద్దిపేట అన్న ప్రసాదం

- కేదారినాథ్ యాత్రికులకు అన్నదానం చేయడం అభినందనీయం
- అన్నదాన కరపత్రాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

మానవ సేవయే..మాధవ సేవా..! అన్ని దానాల కన్నా గొప్ప దానం అన్నదానం అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట కేదారినాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో కేదారినాథ్‌లో భక్తులకు మే 2 నుంచి ప్రారంభం కానున్న అన్నదాన కార్యక్రమ కరపత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట అంటే సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు అన్నారు. దేశంలో చార్ ధామ్ యాత్రలో అమర్ నాథ్, కేదారినాథ్ యాత్రలు ప్రత్యేకమైనవని, అలాంటి యాత్రకు వెళ్లే భక్తులకు అక్కడ భోజనం పెట్టె అదృష్టం సిద్దిపేట ప్రజలకు, కేదారినాథ్ సేవ సమితికి కలిగిందన్నారు. అమర్ నాథ్ వెళ్లే యాత్రికులకు, ఇప్పుడు కేదారినాథ్ వెళ్లే భక్తులకు ఇలాంటి సౌకర్యం అంత దూరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అమర్ నాథ్ సేవ సమితి.. కేదారినాథ్ సేవ సమితి సభ్యులు సామాజిక సేవ, ఆధ్యాత్మిక సేవలో భాగస్వామ్యం కావడం సంతోషకరామన్నారు. ఏప్రిల్ 25న శరబెశ్వర ఆలయంలో కేదార్ నాథ్‌కు ఆహార పదార్థాల వాహనం ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చీకోటి మధుసూదన్, గంప శ్రీనివాస్, మంకాల నవీన్ కుమార్, గంజి రాములు, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



వైద్యం వికటించి వ్యక్తి మృతి

మృతదేహంతో ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన





నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్‌లో వైద్యం వికటించడంతో ఆదివారం శివ్వంపేటకు చెందిన చిప్ప యాదగిరి (46) మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మృతుడి బంధువుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శివ్వంపేటకు చెందిన చిప్ప యాదగిరి శనివారం అర్ధరాత్రి సమయంలో కడుపునొప్పి రావడంతో తూప్రాన్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్‌కి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆస్పత్రి డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో కాంపౌండర్లు చికిత్స చేయడంతో వైద్యం వికటించి ఆదివారం ఉదయం మరణించాడు. అయితే ఆసుపత్రి వైద్యులు హాస్పిటల్‌లోనే ఉన్నా, కాంపౌండర్లతో వైద్యం చేయించారని మృతుని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రి వైద్యులే శనివారం రాత్రి వైద్యం చేశారని, యాదగిరి మృతి చెందడంతో కాంపౌండర్ వైద్యం చేశాడని బుకాయిస్తున్నారని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే యాదగిరి మృతి చెందారని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆరోపించారు. ఆస్పత్రి వద్ద మృతదేహంతో మృతుని కుటింబీకులు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ జి శివానందం, పోలీసులు ఆందోళన చేపట్టిన మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి నచ్చచెప్పారు. ఎస్ఐ జోక్యంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.శివానందం తెలిపారు.

అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన కల్హేర్‌లో తాజా మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి సాయిలు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి ఉగాది పండుగ రోజైన ఆదివారం ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు రైతులకు అందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం వర్షాలు సకాలంలో పడి.. రైతులకు పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రవ ంలో మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు రామ్ సింగ్, మాజీ అధ్యక్షులు నారాయణరావు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు గని, పీఏసీఎస్ చైర్మెన్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ బాలయ్యమాజీ ఎంపీటీసీలు సంగప్ప, శ్రీనివాస్ గౌడ్, పార్టీగ్రామాధ్యక్షులు పండరి తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ గ్లాస్‌తో ఆరోగ్యాన్ని కాపాడాలి

- ప్రతి గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా ఇస్తాం
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని హోటల్‌లలో ప్లాస్టిక్ గ్లాసులు నిషేధించి స్టీల్ గ్లాస్‌లను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో హుస్నాబాద్ పట్టణంలోని హోటల్ యజమానులకు స్టీల్ చాయ్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హోటళ్లలో చాయ్ తాగినప్పుడు ప్లాస్టిక్ గ్లాస్‌లో తాగడం ద్వారా అనారోగ్యాలకు గురవుతున్నారని, ప్లాస్టిక్‌ను మన జీవితం నుంచి దూరం చేయాలని సూచించారు. హుస్నాబాద్‌లో 50 హోటల్‌లు ఉన్నాయని, ప్రతి హోటల్‌కి వంద గ్లాసుల చొప్పున ఇచ్చామన్నారు. ప్రతి గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా హోటళ్లకు స్టీల్ గ్లాసులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి, డిపీవో దేవకీ దేవి , సింగిల్ విండో చైర్మెన్ శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునగౌడ్, తహసిల్దార్ రవీందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

నవతెలంగాణ-కల్హేర్

అనారోగ్యాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా ఉంటున్నదని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోచబోయిన కవితకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.27,000 చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల వారికి సీఎం సహాయనిధి పథకం ఎంతగానో ఉపయోగపడు తుం దన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు సీఎం సహాయ నిధి పథ కాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. అనంతరం ఆయ న్ను లబ్దిదారులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు రామ్‌సింగ్, మాజీ అధ్యక్షులు నారాయణరావు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు గని, పీఏసీఎస్ చైర్మెన్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ బాలయ్య, మాజీ ఎంపీటీసీలు సంగప్ప, శ్రీనివాస్ గౌడ్, ప్రార్టీ గ్రామాధ్యక్షులు పండరి తదితరులు పాల్గొన్నారు.



కలశ యాత్రలో పాల్గొన్నచంద్రారెడ్డి దంపతులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన ఉత్తరాది మహిళలు లిమా అంబి మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పుర స్కరించుకుని కలశ యాత్ర ఊరేగింపు కార్యక్రమాన్ని ఆది వారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలశ యాత్ర ఊరేగిం పులో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జైదుర్గా మాత నినాదాలతో మున్సిపల్ వీధులు మార్మోగిపోయాయి.అనంతరం దుర్గా మాత ఆలయంలో మహిళలతో కలిసి చంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉత్తరాది మహిళలు ప్రతీ ఏటా కలశ యాత్ర నిర్వహించడం వారి సంస్కృతి సంప్ర దాయా లకు నిదర్శనమన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చంద్రారెడ్డిని మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయ కులు దిననాథ్, రాజారామ్, శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీ టీసీ రాజు, జె.జె సింగ్, లక్కన్, ఉమేష్ యాదవ్, టింకు, విజయ్, భావన్నా, మా అంబి మహిళా సేవాసమితి సభ్యులు దుర్గవతి దేవి, పరంశీల దేవి, ప్రమీల దేవి, ప్రియాంక పాల్గొన్నారు.



రాచన్న స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని బడంపేట్ గ్రామంలో గల రాచన్న స్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వావసు నామ నూతన సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని.. పాడి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. పంచాంగ శ్రవణం అనంతరం పచ్చడి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప, ఆలయ కమిటీ సభ్యులు దయానంద్ పటేల్, శ్రీపాల్, గ్రామ పెద్దలు రాచయ్య, రమేష్, సంజీవ్, ఆలయ అర్చకులు జగదీశ్వర్ స్వామి, చెన్నవీరయ్య స్వామి, బిచ్చయ్య స్వామి, ఆలయ సిబ్బంది బస్వరాజు స్వామి, భుజంగం, విశ్వనాథం, భక్తులు శివరాజ్ రంజోల్ సంగమేశ్వర్ వైద్యనాథ్ రమేష్ పాల్గొన్నారు.

అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన బీబీ పాటిల్



నవతెలంగాణ-చౌటకూర్

ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గల శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని జహీరాబాద్ బీజేపీ మాజీ ఎంపీ బి.బి పాటిల్ ఆదివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను ఆలయ పూజారి తీర్థాల రామకృష్ణ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల బీజేపీ అధ్య క్షుడు ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు రాకేష్, చౌటకూర్ గ్రామ అధ్యక్షుడు మాణిక్యం, సీని యర్ నాయకులు మహిపాల్ రెడ్డి, మాణిక్ రెడ్డి, గాండ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జనార్ధన్,సుధాకర్ గౌడ్, భూపాల్, కోర్పోల్ రాజు, బాలు, రామకృష్ణ బీజేపీ నాయకులు, బజరంగ్ దళ్ నాయకులు ప్రభుకుమార్ గౌడ్, కార్యకర్తలు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఉగాది సంబురాలు

నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్ద, మనూర్ మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరిపారు. తెలుగు కొత్త సంవత్సరం కావడంతో ఉదయాన్నే షడ్రుచుల ఉగాది పచ్చడి సేవించారు. ఆలయాల వద్ద పురోహితులు పంచాంగ శ్రావణం చేశారు. డవ్వూరు లొంకా హనుమాన్ ఆలయం వద్ద డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి ఉగాది వేడుకలో పాల్గొన్నారు. అనంతరం చలి వేంద్రం ప్రారంభించారు. తదనంతరం మనూర్ మండలం కేంద్రంలో రెడ్డి సంఘం నూతన భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవచారి మారుతీరెడ్డి, సిద్ధారెడ్డి సంగారెడ్డి, శివాజీరావు పటేల్, అశోక్‌రావు. వెంకట్ భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్లేపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని మల్లేపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులను గ్రామ ప్రత్యేక అధికారి మర్రి ప్రదీప్ ఆదివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు చింతా ప్రభాకర్ ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.9 లక్షల వ్యయంతో సుమారు 200 మీటర్ల సీసీ రోడ్లు మంజూరు చేయించారన్నారు. ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ పనులను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పద్మావతి పాండురంగం, మాజీ ఎంపీపీ విట్టల్, మాజీ ఎంపీటీసీ రాందాస్, మాజీ సర్పంచ్ శివలీల జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శి కట్కం శ్రీనివాస్, జిల్లా నాయకులు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ మానేయ్య ఉపసర్పంచ్ రామప్ప, రాజిరెడ్డి, భాస్కర్ లక్ష్మిరెడ్డి, సుధాకర్, గ్రామస్తులు దయానందం, సత్యానందం ,మాణిక్యం శిమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని తన స్వగ్రామమైన ఖానాపూర్(కే)లో ఉగాది పండగ సందర్భంగా ఏర్పాటుచేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రైతులకు ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు బాగా పంటలు పండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, నాయకులు మోహన్ సాగర్, సివిల్ కాంట్రాక్టర్ ప్రశాంత్ సాగర్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాత పాఠశాల ప్రాంగణంలోనే తరగతి గదులు నిర్మించాలి

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే అదనపు తరగతి గదులను నిర్మించాలని కోరుతూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం ప్రత్యేకంగా అందించారు. గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 1002లో పరిశ్రమ సహకారంతో నిర్మిస్తున్న అదనపు గదులను అక్కడ కాకుండా గ్రామంలోనే నిర్మించడం వల్ల విద్యార్థులకు దూరాభారం కూడా తగ్గుతుందన్నారు. ప్రస్తుతం గ్రామ శివారులో గల పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాపరెడ్డి ప్రదీప్ గౌడ్ సుధాకర్ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రవీణ్ యాదగిరి నర్సింలు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఏప్రిల్ 4, 5 తేదీల్లో జోగిపేటలో జరగనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు సాక్షి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాక్షి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. చదువుతూ పోరాడు.. చదువు కై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ అను నిత్యం విద్యారంగా సమస్యలపై పోరాడుతున్నదన్నారు. విద్యారంగం ప్రైవేటీకరణ కాకుండా నిరంతరం పోరాడుతున్నదన్నారు. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ జిల్లా మహాసభలకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని ఆమె తెలి పారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని విద్యార్థులు మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు

నీడ లేదు నీళ్లు లేవు..



ఎండకు మాడుతున్న ఉపాధి హామీ కూలీలు

- సౌకర్యాల ఏర్పాటులో అధికారులు విఫలం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు

నవతెలంగాణ-మునిపల్లి

ఈసారి వేసవికి ముందు నుంచే ఎండలు ప్రతాపం చూపిస్తున్నాయి. ఇప్పటికే 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దాంతో ఇంటి నుంచి బయటికి రావాలంటే జనం జంకుతున్నారు. కానీ పని చేస్తే గానీ పూట గడవని పేద కుటుంబాలు ఈ ఎండల్లోనే పనులకు వెళ్తున్నారు. అయితే పని ప్రదేశాల్లో సరైన నీడ కూడా లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో సైతం సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. నిప్పులు కొరుస్తున్న ఎండకు మాడుతూనే పనులు చేస్తున్నారు.

మండలంలోని 30 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగు తున్నాయి. అయితే చాలా గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమ య్యారు. తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు అందించాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కూలీలు ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న నీళ్లే వారికి దిక్కు అవుతున్నాయి. కనీసం ఎండ వేడి నుంచి తప్పించుకోవడానికి నీడ కూడా ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో చాలా మంది ఉపాధి పనులకు వెళ్తుంటారు. ఏడాదిలో వంద రోజులు పని అందుతుండడంతో చాలామంది పేదలు ఉపాధి హామీ పనులపై ఆధారపడి కుటుం బాలను పోషించుకుంటారు. అయితే పనిప్రదేశాల్లో సౌకర్యాల లేమి వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల ధాటికి ఆరోగ్యం కూడా దెబ్బతింటున్నదని కూలీలు వాపోతున్నారు. పనికి వెళ్తే వచ్చిన డబ్బులన్నీ ఆసుపత్రులకు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఎండల ధాటికి తట్టుకోలేక కొందరు కూలీలు మృతి చెందగా.. మరికొందరు అనారోగ్యం పాలయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశాల్లో ఉచితంగా పనిముట్లు అందించాల్సి ఉన్నప్పటికీ.. కొన్నేండ్లుగా వాటి జాడే లేదని కూలీలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇదే విషయమై ఏపీవో (అసిస్టెంట్ ప్రాసిక్యూషన్ ఆఫీసర్) యాదగిరి వివరణ కోరగా.. మంచి నీళ్లు, టెంట్, సమయం గురించి ఆయా గ్రామాల కార్యదర్శులకు చెబుతామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

ఇదే విషయమై మునిపల్లి టెక్నికల్ అసిస్టెంట్ మహబూబ్‌ను వివరణ కోరగా.. ఇప్పుడున్న పరిస్థితుల్లో అవన్నీ తాము ఏర్పాటు చేయలేమని.. ఎవరి మంచినీళ్లు వాళ్ళే తెచ్చుకోవాలన్నారు. టెంట్ ఉంటే వేయిస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. కాగా ఉపాధి పనులు ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు టెంట్ గుర్తుకు రాలేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్ ఇలా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం సరికాదని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



విశ్వావసు సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో నూతన కాంతి వెలుగులు నింపాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభిలాషించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని చైతన్యనగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పురపెద్దలతో పాటు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు రాశి ఫలాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మాజీ జడ్పీటీసీ జైపాల్, మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు, ప్రతాప్ గౌడ్, ప్రకాష్ రావు, మాజీ ఎంపిటిసి రామచంద్రారెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ఆలయాల సందర్శన..

ఉగాది పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయం, పటాన్ చెరు పట్టణ పరిధిలోని చైతన్యనగర్ హనుమాన్ ఆలయాలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సిఐ వినాయక్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, రుద్రారం సొసైటీ చైర్మన్ పాండు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, వెంకన్న రాజు, తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జోగిపేట

2025-26 సంవత్సరానికి గాను జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అల్లే శ్రీకాంత్ అధ్యక్షతన స్థానిక లయన్స్ భవన్లో ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా బి.రవి శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది సంతోష్, కోశాధికారిగా మున్నూరు మల్లేశం, ఉపాధ్యక్షులుగా జీఆర్.మధుసూ దన్‌రెడ్డి, డాక్టర్ జాన్ పాల్, జాయింట్ సెక్రటరీగా కొత్త శ్రీని వాస్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ క్యాబినెట్ పిఆర్ఓ డాక్టర్ కే.అనంతరెడ్డి, డిస్టిక్ ఏరియా కోఆర్డినేటర్ ఆకుల రాంబాబు, మాజీ రీజియన్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, సీనియర్ లైన్స్ సభ్యులు ఎస్. నారాయణ రెడ్డి, పద్మనాభరెడ్డి, ఎం. జగన్ మోహన్ రెడ్డి, రామకృష్ణ, పి.సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



రవి శేఖర్‌రెడ్డి | సంతోష్ | మల్లేశం

పలు తీర్మానాలు ఆమోదం..

జోగిపేట లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్ ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు. జూలై మొదటి వారంలో నూతన పాలకవర్గ రమణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. క్లబ్ తరపున చేపట్టే కార్యక్రమాలను 24 గంటల ముందుగా క్లబ్బు సభ్యులకు సమాచారం ఇవ్వాలని క్లబ్ సీనియర్ సభ్యులు ఎం పద్మనాభరెడ్డి సూచించారు. దీనికి సభ్యులు ఆమోదం తెలిపారు. క్లబ్ ఏర్పడి 50 వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సేవా కార్యక్రమాలు అధిక సంఖ్యలో చేపట్టి క్లబ్బుకు మంచి పేరు తీసుకురావాలని డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్ సూచించారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

నవతెలంగాణ-జహీరాబాద్

కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయడం జహీరాబాద్ నియోజకవర్గ ప్రత్యేకత అని.. ఇది మతసామరస్యానికి ప్రతీక అని డీసీఎంఎస్ చైర్మెన్ శివ కుమార్ అన్నారు. కీర్తిశేషులు మాజీ మంత్రి ఎం.డి ఫరీదోద్దీన్ ఇంట్లో ఆయన తనయుడు టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చశాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మెన్లు మహంకాల్ సుభాష్ గుప్తా, అల్లాడి నర్సింలు గుప్తాలతో కలిసి శివకుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం కచేరి పండ్లను తినిపించి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మాజీమంత్రి ఫరీదొద్దీన్ అన్ని కుల మతాల వారిని కలుపుకొని అన్ని పండుగల్లో పాల్గొని ప్రత్యేక చరిత్రను సృష్టించారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు మహమ్మద్ తన్వీర్ కూడా విజయవంతంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రంగా అరుణ్ కుమార్, గుండప్ప యాదవ్, విజయ్‌కుమార్, మహమ్మద్ కుతుబుద్దీన్, జహంగీర్, రాములు నేత, మహమ్మద్ షబ్బీర్,మహమ్మద్ బాసిత్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగిరెడ్డి, జనార్దన్, మహమ్మద్ అయుబ్, బీజీ సందీప్, బాల్రెడ్డిసైఫుద్దీన్ గౌరీ, మహమ్మద్ ముబీన్,హర్షద్ పటేల్, మథిన్ మల్సాబ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టపగలే మహిళా దారుణ హత్య

- ఇంట్లోకి చొరబడి సిలిండర్ బాది

హతమార్చిన దుండగుడు

నవతెలంగాణ-జహీరాబాద్



(ఫైల్)



జహీరాబాద్ పట్టణ పరిధిలోని పస్తాపూర్ ఆర్టీవో ఆఫీస్‌కి సమీపంలో పట్టపగలే ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఒంటరిగా ఉంటున్న ఆమె ఇంట్లోకి చొరబడిన దుండగుడు.. సిలిండర్ బాది ఆమెను హతమార్చాడు. జహీరాబాద్ ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలంలోని చిలమామిడి గ్రామా నికి చెందిన మేతరి లక్ష్మి(40) గత కొన్ని రోజులుగా ప్రస్తాపూర్‌లో అద్దెకు ఉంటూ చుట్టుపక్కల ప్రాంతంలోని ధాబాల్లో కూలి పని చేస్తుండేది. ఆమె ఏకైక కుమారుడు హైదరా బాద్‌లో ఉంటున్నాడు. అయితే ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లోకి ఓ దుండగుడు చొరబడి.. సిలిండర్‌తో బాది హత మార్చాడు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు అక్కడి రాగానే.. దుండగుడు పరారయ్యాడు. ఘటనా స్థలానికి క్లూస్ టీంతో పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై చెప్పారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఓటీఎస్ స్కీంకు మంచి స్పందన



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారంలో ఓటీఎస్ స్కీముకు మంచి స్పందన లభించిందని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తిపన్నుల వసూలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మెడ్రిచ్ లిమిటెడ్ వారు రూ. 5,93,280లు, ఎస్‌డి స్టీల్ ఇండస్ట్రీస్ వారు రూ.1,82,002లు, విజేత ఎంటర్‌ప్రైజెస్ వారు 3,01,898 మరియు ఇతర నివాస గృహాల యజమానులు ఆస్తి పన్నులు చెల్లించారు. మొత్తం రూ.11 లక్షల 20 వేల ఆస్తి పన్నులు వసూలు చేసినట్టు కమషనర్ తెలిపారు. బొల్లారం మున్సిపాలిటీలో మొత్తం రూ.16.06 కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వరకు రూ.13.75 కోట్ల ఆస్తి పన్నులు (85.6శాతం) ఆస్తి పన్నులు వసూలు చేసి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరుకు అర్హత సాధించడం జరిగిందన్నారు. ఆస్తి పన్నుల వసూళ్లలో సిడిఎంఎ, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ప్రత్యేక అధికారి ప్రోత్సాహం సహకారం మరువలేనిదన్నారు. మున్సిపాల్టీలోని పారిశ్రామికవేత్తలు, పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మునుపెన్నడూ లేనివిధంగా ఓటిఎస్ స్కీంను ఉపయోగిస్తూ బకాయి ఆస్తి పనులతో పాటుగా ప్రస్తుత సంవత్సర ఆస్తి పన్నులు పెద్దమొత్తంలో చెల్లించి మున్సిపాల్టీ అభివృద్ధికి దోహదపడుతున్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్తి పన్నుల వసూళ్లలో మున్సిపాల్టీ సిబ్బంది సెలవు దినాల్లో కూడా ఎంతో అంకిత భావంతో పనిచేస్తూ చాలా ఓర్పుతో నేర్పుతో 85.6శాతం ఆస్తి పన్నులు వసూలు చేసి జిల్లా స్థాయిలో ఒకటో స్థానం మరియు రాష్ట్రస్థాయిలో పదో స్థానంలో నిలపడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఆఫీసర్ టి. నరసింహులు, మేనేజర్ మల్లికార్జున స్వామి,మున్సిపల్ ఏఈ కిష్టయ్య సీనియర్ అకౌం టెంట్ శ్రీకాంత్, వినోద్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు





నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లు మరియు తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిపారు. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌కాలనీలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ పాల్గొన్నారు. అనంతరం శ్రీరామ నవమి పండుగ ఏర్పాట్లు కళ్యాణోత్సవం కార్యక్రమాల గురించి ఆలయ కమిటీ సభ్యులతో కార్పొరేటర్ చర్చించారు. పాత రామచంద్రాపురం లోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో, పంచాంగ శ్రవణం కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో, కాలనీలలో జరిగిన ఉగాది వేడుకల్లో మాజీ చైర్పర్సన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.

బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్ కాలనీలో బాలాజీ ఫౌండేషన్ చైర్మెన్ బలరాం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్ర ఏర్పాటు చేశారు. సాయినగర్ కాలనీ గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, నవ భారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్, అరుష్ ఫౌండేషన్ చైర్మెన్ తలారి నవీన్ ముదిరాజ్, సామాజికవేత్త విజయేందర్, సామాజికవేత్త అభిమన్యు పాండేతో కలిసి చలివేంద్రాన్ని బలరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ చలివేంద్రాలు వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శ్రీ బాలాజీ ఫౌండేషన్ గత 8 ఏండ్లుగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చలివేంద్రాలతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలను బాలాజీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్నామ న్నారు. ప్రతీ ఒక్కరు సమాజసేవలో భాగమై పేద ప్రజలకు తమకు తోచిన విదంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, యాదగిరి, గోపాల్ రెడ్డి,శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ, రాజేందర్, సుధాకర్, జగదీష్, శ్రీకాంత్ రెడ్డి, అభి తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సిట్టింగ్ జడ్జిలతో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి యునైటెడ్ క్రైస్తవ ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీని ఆదివారం సంగారెడ్డి ఐబి నుండి సీఎస్ఐ చర్చి వరకు నిర్వహించారు. వేలాది మంది క్రైస్తవులు శాంతియుత ర్యాలీలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని విచారణ జరిపాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పలువురు క్రైస్తవులు మాట్లాడుతూ.. దేశంలో క్రైస్తవులపై దాడులను ఆపాలని క్రైస్తవులకు దేశంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై విచారణ చేయాలని కోరారు. అనేకచోట్ల క్రైస్తవులపై దాడులన తీవ్రంగా ఖండించారు. క్రైస్తవులపై దా డులు చేసే ఊరుకునేది లేదన్నారు. మనుషులంతా ఒక్కటే ఏకత్వంలో భిన్నత్వముగా ఉండాలని శాంతియుతంగా ఉండాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల వృత్తి తీరని లోటు అని అన్నారు. ఇకపై క్రైస్తవులంతా ఏకం కావాలని, కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ క్రిస్టన్ ఫోరం క్రైస్త వులు, వం వి ా ళ ల ం పాల్గొన్నారు.



సేవాలాల్ గుడి నిర్మాణానికి రూ.51వేల విరాళం

- పబ్బ మహేష్ గుప్త



నవతెలంగాణ-శివ్వంపేట

ప్రతి నిత్యం సేవా కార్యక్రమాలలో ముందుండే శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త మండలంలోని లింగోజీగూడ తండాలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ శ్రీసేవాలాల్ ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.51 వేల విరాళాన్ని ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ గిరిజన తండాలలో ఆధ్యాత్మికతను పెంపొందించేలా సేవాలాల్ ఆలయాలను నిర్మించడం గొప్ప విషయమన్నారు. అడిగిన వెంటనే కాదనకుండా విరాళం అందించిన మాజీ జెడ్పీటీసీకి తండా నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తండాలో అనారోగ్యంతో బాధపడుతున్న మాలోత్ పద్మకు ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, మాజీ సర్పంచులు సులోచన నర్సింహారెడ్డి, మేఘవత్ రవి, మాజీ ఉపసర్పంచ్ కంటాల రాజేష్, పిల్లి ఏసాములు, కమ్మరి సురేష్, పిల్లి మధు, తండా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లు, ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

- ఉగాది రోజు ప్రారంభించిన ఎస్.ఐ జి.శివానందం



నవతెలంగాణ-తూప్రాన్

పట్టణంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద లారీ డ్రైవర్లు ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉగాది రోజు ఆదివారం ఎస్.ఐ శివానందం ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలు నీరు ఎక్కువగా తీసుకోవాలని, శరీరంలో డిహైడ్రేషన్ ఎక్కువగా అవుతుందని, దానివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండుటకు ప్రజలు ప్రయాణికులు నీరు ఎక్కువగా త్రాగాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం లారీ అసోసియేషన్ వారు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్లు, ఓనర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు రేపల్లి నాగరాజు, లంగరు శ్రీనివాస్ రావు, రాము పంతులు, జంగం కృష్ణ లతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏడుపాయల వనదుర్గ మాతను దర్శించుకున్న కలెక్టర్

నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల వనదుర్గా మాతను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేదమంత్రాలతో పూర్ణకుంభంతో కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. వారికి దుర్గామాత దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మన పండుగలు, ఆచారాలు సంప్రదాయాల వెనుక ఎంతో శాస్త్రీయత దాగి ఉంటుందని ఉగాది పండుగ ఇది వసంతకాలం రాకను కూడా ప్రభావితం చేస్తుందని ఆరోగ్యపరంగా చూస్తే వసంత ఋతువు ప్రారంభంలో వచ్చే కొన్ని రకాల వ్యాధులకు విరుగుడు ఈ వేపపువ్వు వేసి చేసిన ఉగాది పచ్చడి. వసంత ఋతువు ప్రారంభంలో వచ్చే ఈ ఉగాది పండుగను ప్రధానంగా ప్రకృతి పండుగగా తెలుగు ప్రజలు భావిస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ కుటుంబ సమేతంగా ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు అమ్మవారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాల స్వీకరించి ఆలయ విశిష్టత గురించి



నిర్వాహకులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు , అర్చకులు తదితరులు పాల్గొన్నారు

కమనీయంగా సాగిన భర్మస్వామి రథోత్సవం

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామ శివారులో వెలసిన భర్మస్వామి జాతర ఉత్సవాలలో భాగంగా ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మెన్ పిల్లి శివకుమార్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన భర్మస్వామి రథోత్సవ కార్యక్రమం ఆదివారం కనుల పండుగగా సాగింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో గిరిజన భక్తులు హాజరు కాగా, ఉమ్మడి మెదక్, హైదరాబాద్ జిల్లాల నుంచి స్వామివారి భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవాలకు హాజరైన ప్రముఖులు

భర్మస్వామి రథోత్సవ వేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సుహాసిని రెడ్డి, రాష్ట్ర నాయకులు మురళీయాదవ్, జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిలుగా విచ్చేసి భర్మస్వామి, శ్రీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ చంద్రాగౌడ్, జెడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, వైస్ మాజీ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త, మాజీ రైతు సంఘం అధ్యక్షులు నర్సింహా రెడ్డి,



మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు పెద్దపులి రవి, ఉపసర్పంచుల మాజీ జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ శివకుమార్, వైస్ చైర్మన్ స్వామి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న కమాన్ ప్రారంభోత్సవం

- ఎడ్ల బండి ఎక్కిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు
- చల్మెడ రూపురేఖలనే మార్చేస్తాను
- ఎమ్మెల్యే రోహిత్ రావు





నవతెలంగాణ-నిజాంపేట,

మండలపరిధిలోని చల్మెడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి కమాన్‌ను ఆదివారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్మెడ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మాది మాటల ప్రభుత్వం కాదనీ చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో చల్మెడ రూపురేఖలు మార్చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన మల్లేశం, కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, తిరుమల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అక్క పల్లి రాంరెడ్డి, బాజే రమేష్, తుమ్మల రమేష్, కాకి రాజయ్య, పంజా మహేందర్, నసిరుద్దీన్, సత్యనారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, లింగం గౌడ్, మెట్టు వెంకట్, సామల మహేష్, మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ఉగాది సంబరాలు

- పంచాంగ శ్రవణం చదివి వినిపించిన పురోహితులు

నవతెలంగాణ-నర్సాపూర్

మండలంలోని వివిధ గ్రామాలలో ఉగాది పండగ సంబరాలు ఆదివారం అంబరాన్ని అంటాయి. ఉదయం ఆయా గ్రామాల ప్రజలు ఇండ్లను శుభ్రపరచి తీపి వంటలు వండుకొని పచ్చడ తయారుచేసుకొని తాగారు. సాయంత్ర సమయంలో ఆయా గ్రామాలలోని దేవాలయాల వద్ద పండితులు పంచాంగ శ్రవణం కావించారు. నర్సాపూర్ పట్టణంలోని ఆదిలక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో సాయంత్రం వేద పండితులు గౌడిచర్ల హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మల్లేష్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తా, పట్టణవాసులు రమణారావు, రమేష్ గౌడ్, జ్ఞానేశ్వర్, దేవేందర్ యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పంచ పరివర్తనతో దేశంలో సమూల మార్పు





నవతెలంగాణ-తూప్రాన్

పంచ పరివర్తనతో దేశంలో సమూల మార్పు రావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం జిల్లా కార్యవాహ వనముల ఓంకార్ జీ ప్రబోధించారు. ఆదివారం తూప్రాన్ పట్టణంలో ఉగాది పండుగ, డాక్టర్ హెడ్గేవార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓంకార్ జీ మాట్లాడుతూ సమరసత, స్వదేశీ, స్వభాష, పర్యావరణం, నాగరిక శిష్టాచారం,గ్రామ గ్రామాన ఆర్.ఎస్.ఎస్ శాఖ ల విస్తరణ జరిగి ప్రతి ఇంటి నుండి ప్రత్యేక చొరవతో సమూల మార్పు రావాన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్, లయన్ డాక్టర్ జానకిరామ్ చేసిన సేవలకు గుర్తింపుగా అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా ఆయనను సన్మానించి సత్కరించారు. అలాగే పోస్ట్ కార్డ్ లేఖల పోటీలో జాతీయ స్థాయిలో అవార్డ్ నగదు పారితోషికం అందుకున్న గీతా స్కూల్ వైస్ ప్రిన్స్ పాల్ రాజేశ్వర్‌ను తాటి వెంకటేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. షడ్రుచులతో మేళవించిన ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఖండ సహ కార్యవాహ మామిడి నివేదన్, రామునిగారి అశోక్ కుమార్ గౌడ్, మధుసూదన్ రావు, శివ నర్సింలు, ఐలేని, నర్సోజీ, తాటి విఠల్, రామునిగారి మహేష్ గౌడ్, భూమన్నగారి జానకిరామ్,.శ్రీహరి, మధు, శ్రీనివాస్, పి.రాజన్, పోల శ్రీనివాస్, బాధే వాసుదేవ్, మాలే నగేష్ గుప్త, మాలే కుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందుకున్న వెంకటేశ్వర శర్మ

నవతెలంగాణ-శివ్వంపేట

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విద్యా రంగంలో పలు సేవా కార్యక్రమాలలో విశిష్ట సేవలందించినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ఉగాది సేవా పురస్కారాన్ని శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠం వ్యవస్థాపకులు, అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఉగాది పర్వదినం ఆదివారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సేవా పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మను ఉగాది పురస్కారం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత వెంకటేశ్వర మాట్లాడుతూ అమ్మవారికి చేసిన సేవలకుగాను అమ్మవారి దయతో ఉగాది పురస్కారం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



బర్డ్ ఫ్లూ వ్యాధి సోకడంతో కోళ్ళు చనిపోతున్నాయి

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న తండా వాసులు, విద్యార్థులు
- స్కూల్ పిల్లలకు రోగాలు సోకే ప్రమాదం
- పట్టించుకోని అధికారులు
- పౌల్ట్రీ ఫార్మ్‌ను వెంటనే బంద్ చేయించాలి



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ, జడ్చెరు తాండ గ్రామాల మధ్యన గల పౌల్ట్రీ ఫార్మ్‌లలో బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకడంతో దాదాపు 8,500 కోళ్ల వరకు చనిపోయాయి. చనిపోయిన కోళ్లను గుంతలు తీసి వాటిలో పూడ్చకపోవడంతో దుర్వాసన విపరీతంగా సోకుతుందని తాండవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న గుడ్ షెఫర్డ్ స్కూల్ విద్యార్థులకు దుర్వాసన సోకి ప్రమాదకరమైన వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మూడు రోజుల నుంచి ఇదే దుర్వాసన వస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని తాండవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పౌల్ట్రీ ఫార్మ్ కు అనుమతులు ఇవ్వకుండా, వాటిని మూసి వేయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తాండావాసులు పేర్కొన్నారు.

బండ్ల ఊరేగింపు

నవతెలంగాణ-టేక్మాల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బండ్ల ఊరేగింపును నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల మధ్యన ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం దుబ్బగట్టు పైన వెలసిన వెంకటేశ్వర స్వామి కి నాలుగు గ్రామాల నుండి బండ్లను ఊరేగింపుగా తీసుకొని ప్రదక్షిణలు చేశారు. దుబ్బ గట్టుపై వెలసిన శ్రీ వెంకటేశ్వర ఆలయానికి చుట్టుపక్కల నుంచి కాకుండా వేరే జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడ వెలిసిన వెంకటేశ్వర ఆలయానికి ప్రత్యేకత ఉందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఆలయానికి నిర్వహణ కోసం మాగానే ఉందని దీన్ని శేషాద్రి పంతులు గన్నారం వారి వంశం మాగాన్ని సాగు చేసుకుంటూ ఆలయంలో ధూప దీప నైవేద్యాలు సమర్పి స్తుంటారు. ఈ ఆలయంలో మొక్కిన భక్తుల కోర్కెలు తప్పకుండా తీరుతాయని నమ్ముతుంటారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తిలకిస్తూ ఉంటారు. చివరి రోజు పాసిబండ్లతో ఉత్సవాలు ముగుస్తాయి.



ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-శివ్వంపేట

సమాజంలో సమానత్వం, సోదరభావం, మతసామరస్యంతో అతి పవిత్ర రంజాన్ పండగను ముస్లిం, మైనార్టీ సోదరులు ఆనందంగా జరుకోవాలని, జిల్లాలోని ముస్లిం సోదరులందరికి మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షేక్ అలీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రామానాన్ని అనుసరించే ఇస్లామిక్ కేలండర్ తొమ్మిదవ నెల 'దీనిని పవిత్ర రంజాన్ ' మాసమని ముస్లిం సోదరులు భావిస్తారని ఆయన తెలిపారు. మానవుల మార్గ దర్శనం కోసం, సమాజంలో విలువల విస్తృతి కోసం "అల్లా" పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరింపజేశారని, అల్లాను వేడుకుంటూ ప్రశాంత వాతావరణంలో, కుటుంబ సభ్యులతో ఆనందంగా సోమవారం రంజాన్ పండగను జరుపుకుందామని ఆయన సూచించారు.



నిజాంపేటలో ఎల్లమ్మ రథం ఊరేగింపు



నవతెలంగాణ-నిజాంపేట : గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద జాతర కొనసాగుతుంది. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ రథం ఊరేగింపు గ్రామం లోని పురవీధుల గుండా డప్పు చప్పుళ్లతో ఆటపాటలతో భారీగా ఊరేగింపు కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ పురస్కరించుకొని ఎల్లమ్మ రథం ఊరేగింపు కొనసాగడం ఆనవాయితీగా జరుగుతున్నది. గ్రామస్తులు ఆసక్తితో తిలకిస్తున్నారు. గ్రామస్తులు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

దాడి ఘటనలో కేసు నమోదు

- ఎస్ఐ మధుకర్ రెడ్డి



నవతెలంగాణ-శివ్వంపేట: ఇంటి నిర్మాణ స్థలం విషయంలో వ్యక్తిపై దాడి చేసిన విషయంలో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగోజీగూడ గ్రామానికి చెందిన చింతల యాదగిరి తన స్వంత ఖాళీ స్థలంలో కొత్తగా ఇల్లు నిర్మించుకొనేందుకు మట్టిని పోయిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన చింతల రాజు, చింతల రవి, చింతల పోచయ్య, చింతల యాదయ్యలు ఈ నెల 29వ తేది రాత్రి అక్కడికి వచ్చి మేము మా ఇంటికి వెళ్లకుండా మట్టి పోయిస్తావా అంటూ కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో యాదయ్యకు గాయా లు కాగా, అడ్డు యాద గిరి చింతల దేవేందర్‌పై కట్టెలతో దాడి చేసి గాయపరిచారని, గొడవలో విడిపించడానికి వచ్చిన చింతల సంజీవులును కూడ కట్టేలతో కొట్టి గాయపరిచారని యాదగిరి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లుట్ల భర్మస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

- ఆలయ కమిటీ చెర్మెన్ పిల్లి శివకుమార్

నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఉగాది పర్వదినం సందర్భంగా జరిగిన భర్మస్వామి జాతర ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ పిల్లి శివకుమార్ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తుల విరాళాలతో, గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన వెండి కిరీటం చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం పట్టు వస్త్రాలు, కిరీటంను డప్పు చప్పుల్లతో గ్రామ పురవీధుల గుండా ఎదుర్కొని దేవాలయం వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, ఆలయ కమిటీ వైస్ చైర్మెన్ మంగళపర్తి స్వామి, కోశాధికారి తలారి అశోక్, డైరెక్టర్లు బెస్త కిష్టయ్య, సంద్ర లక్ష్మయ్య, చింత మధు, బోసు పుల్లయ్య, పిల్లి వెంకటయ్య, బుర్ర అనిల్ గౌడ్, లక్ష్మణ్ బావోజీ, పిల్లి పెద్ద వెంకటయ్య, నరేష్, రాఘవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉగాది సంబరాలు

నవతెలంగాణ-సంగారెడ్డి: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా వాసవి మహాసంస్థన్-శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం సంగారెడ్డి సన్నిధిలో పంచాంగం ఆవిష్కరణ వాసవి క్లబ్స్ సంగారెడ్డి సౌజన్యంతో నిర్వహించారు. చిదిరే హరిశర్మ చేమ శ్రవ ణం, చంద శ్రీధర్, పుల్లూరి ప్రకాష్, ఇరుకుల్లా ప్రదీప్, కొంపల్లి విద్యా సాగర్, నామ భాస్కర్, అల్లేంకి విజయ్ భాస్క ర్, నామ శ్రీని వాస్ నామ పద్మ చంద శ్రీదేవి, మ్యాడం రాధాకిషన్, జుల కంటి మల్లేశం న్యాల అనురాధ, సచిత్ర, అక్షింతల కృష్ణవేణి గుడికందుల రాజు, శ్రీరామ్ ప్రవీణ్, సభ్యులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
సిద్దిపేట
సోమవారం | 31 మార్చి 2025 | www.navatelangana.com

తిమ్మాయిపల్లి గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-నంగునూరు

మండలం తిమ్మాయిపల్లి గ్రామంలోని రెడ్డి కాలనీలో కీర్తిశేషులు బాలవ్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎండాకాలం దృష్ట్యా బాటసారుల సౌకర్యార్థం వారి కుమారులు చల్లారం పద్మారెడ్డి, చల్లారం సుధాకర్‌రెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ లత, కృష్ణ, మాజీ సర్పంచ్ మల్యాల నర్సింహులు, రెడ్డి సంఘం అధ్యక్షులు చల్లారం రాజశేఖర్ రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు చల్లారం భూంరెడ్డి, వల్లాద్రి నారాయణరెడ్డి, గాల్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట రాజిరెడ్డి, గ్రామస్తులు పుట్ట పర్శరాములు, పిల్లి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-చేర్యాల: రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న చేర్యాల మండలం కాశ గుడిసెలు గ్రామంలోని ముస్లిం సోదరులకు ఆదివారం జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తడక లింగమూర్తి ఆంధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ బండారి కనకయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమని బాలరాజు, కొమురవెల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్ చీపురు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఉగాది పండుగ వేడుకలు












నవతెలంగాణ-మర్కుక్

క్రోధి నామ సంవత్సరానికి విడ్కోలు తెలుపుతూ విశ్వావసు నామ తెలుగు సంవత్సరానికి స్వాగతం తెలుపుతూ, షడ్రుచులతో పచ్చడిని తయారు చేసి ప్రజలు, వారి ఇష్ట దైవాలకు నైవేద్యాంగా సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ సుఖశాంతులతో జీవనం కొనసాగాలని ప్రజలు, వారి ఇష్టదేవతలను పూజించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది శోభకృత నామ సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పురోహితులు పంచాంగ శ్రావణం చదివి వినిపించారు.

నవతెలంగాణ-సిద్ధిపేట

నూతన తెలుగు సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలను, పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పాలనను దేవుళ్ళు సైతం ఆశీర్వదిస్తున్నారని, తెలుగు నూతన విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగంలో ఈ సంవత్సరం పంటలు సమృద్ధిగా పండి, రైతులు సంతోషంగా ఉంటారని ఉండటమే అందుకు నిదర్శనం అని అన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంప మహేందర్ రావు, జీవన్ రెడ్డి, కాలీముద్దీన్, దాస అంజన్న, డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ, అర్బన్ మండల అధ్యక్షులు బిక్షపతి, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, చెంది శ్రీనివాస్, భైరి సాయి, ఆలయ చైర్మెన్ కరుణాకర్ భాగన్న, జనార్ధన్ రెడ్డి చిరంజీవి, కుమార స్వామి, మనోహర్‌రెడ్డి, ఉప్పెరెట్ల సంతోష, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని ధర్మారం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి, ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ ఆలయంలో విశ్వావసు, నామ సంవత్సరం సందర్భంగా పంచాంగాన్ని అర్చకుడు పానుగంటి తిరుపతయ్య, ఆధ్వర్యంలో గ్రామస్తులకు వివరించారు. అదేవిధంగా మద్దూరు, దూల్మిట్ట, మండలంలోని అన్ని గ్రామాల్లో ఆలయంలో ఆలయ అర్చకులు పంచాంగాన్ని ప్రజలకు వివరించారు.

నవతెలంగాణ-నంగునూరు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లలో, గ్రామపంచాయతీల వద్ద ఉగాది పంచాంగం శ్రావణ పఠనం చేశారు. ఒకరినొకరు విశ్వావాసు నామ, నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో నిర్వర్తిస్తూ, వృత్తి, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగంల్లో నిత్యోల్లాసముతో, లాభాలతో విలసిల్లాలని కోరారు. భక్తులు శ్రద్ధగా వారి రాశి ఫలాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఉగాది పచ్చడి విశిష్టతను వివరిస్తూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పురోహితులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని కురుమ కులస్తుల ఆధ్వర్యంలో బీరప్ప ఆలయానికి జలకడవలు, ఉగాది పచ్చడలతో డోలు చప్పుడులతో బీరప్ప, ఆలయానికి చేరుకొని ఉగాది పండుగను బీరప్ప, ఆలయంలో కురుమ కులస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమరవెల్లి మల్లన్న ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎండోమెంట్ కమిషనర్ శ్రీధర్ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. 30 ఏండ్లుగా స్వామి వారి సేవకు ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, ఈ సన్మాన పురస్కారం అందించినట్లు మహాదేవుని మల్లికార్జున్ తెలిపారు.

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణంలోని అతి పురాతన దేవాలయం వేణుగోపాలస్వామి ఆలయంలో గత 60, 70 ఏండ్ల లాగే సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ ప్రధాన అర్చకులు శేశా చార్యులు రాజు స్వామీల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు వేద మూర్తులు శ్రీమాన్ దేశపతి, రామన్న, మర్మాముల రామన్నలచే దేశ కాల పరిస్థితులు 12 రాశుల గ్రహచర ఫలాలుతో కూడిన పంచాంగ పఠనం కావించగా పట్టణానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఉగాది పండుగ సందర్భంగా గజ్వేల్ పట్టణంలో ఎడ్లబండ్ల, ట్రాక్టర్లు, కారులు, ద్విచక్ర వాహనాలు ఊరేగింపుగా నిర్వహించారు. గ్రామ దేవతల చుట్టూ బండ్లను, ఎడ్లను ముస్తాబ్ చేసి ఊరేగింపు నిర్వహించారు. మామిడికాయ, బెల్లం, కొబ్బరికాయ, సోపు , యాప పువ్వు పచ్చడి చేసుకొని ఇంటిల్లిపాది, పప్పు బచ్చాలు, చెక్కర బచ్చాలు చేసుకొని నూతన దుస్తులు ధరించి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పలు దేవాలయాలు నూతన పంచాంగాన్ని ఉపయోగించుకున్నారు.

నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల పరిధిలో రాయపోల్, తిమ్మక్ పల్లి, అనాజిపూర్, రాంసాగర్, వడ్డేపల్లి, చిన్న మాసాన్ పల్లితో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెలుగు ప్రజలందరూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేసుకున్నారు. అలాగే ప్రజలందరూ గ్రామాల్లో ఉదయం నుంచి ఇండ్లను సుందరంగా అలంకరించుకొని, గుమ్మాలకు మామిడి ఆకులతో పచ్చని తోరణాలు కట్టుకొని షడ్రుచుల తోటి ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసుకుని పిల్లలు, పెద్దలు కుటుంబ సభ్యులందరూ కలిసి ఆరగించి ఉల్లాసంగా గడిపారు. అలాగే చేదు, తీపి కలిసినట్లు మంచి చెడు పక్కనబెట్టి అందరికి శుభాలు కలగాలని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళలో ఆయా గ్రామాలలో దేవాలయాల వద్ద జ్యోతిష్యులు నూతన పంచాంగం ఆవిష్కరించారు. రాయపోలు మండల కేంద్రంలో వెంకటేశ్వర శర్మ, వడ్డేపల్లి గ్రామంలో వేద పండితులు నటరాజ శర్మ గ్రామస్తులకు నూతన పంచాంగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్, వడ్డేపల్లి మాజీ సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఉగాది పర్వదినాన్ని పుష్కరించుకొని మిరుదొడ్డి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పంచాంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలోని పంచాంగ కార్యక్రమాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో స్వామి, ఉష్కే కనకయ్య, తుమ్మల నర్సింలు, విద్యాసాగర్ , సత్యనారాయణ , బుచ్చయ్య తోపాటు ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఉగాది చిత్రం వేసిన రామకోటి రామరాజు

నవతెలంగాణ-గజ్వేల్

విశ్వావసు నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని ఉగాది చిత్రాన్ని అద్భుతంగా సబ్బుబిళ్ళ మీద చిత్రించి శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం అందరికీ శుభాలు కలగాలని తీపి, చేదు కలిసిందే జీవితం. కష్టం, సుఖం తెలిసిందే జీవితం. ఆ జీవితంలో ఆనందోత్సవాలన్ని పూయించేందుకే ఈ సంవత్సరం వచ్చిందన్నారు.




మత సామరస్యానికి ప్రతీక రంజాన్ తోఫా

- తాజా మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి ముదిరాజ్

నవతెలంగాణ-తొగుట

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ తోఫా అని మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి ముదిరాజ్ అన్నారు. ఆదివారం రంజాన్ పర్వదినంను పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట గ్రామంలో 32 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని కొనియాడారు. అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయం అన్నారు. రంజాన్ మాసం మత సామారాస్యానికి ప్రతీక భావం పెంపొందిస్తుందన్నారు. ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ మైనార్టీ అధ్యక్షుడు సైఫుద్దీన్, యాకూబ్, మొయినుద్దీన్, ఖలీల్, పాషాబాయ్, అక్బర్, గౌస్ పాషా, షరీఫ్, రుక్కు భాయ్, ఫరీద్ బాయ్, సల్మాన్ ఖాన్, షారుక్, అర్షద్ బబుల్, బాయ్, బీఆర్ఎస్ గ్రామ యువ నాయకులు వెంకటేష్ గౌడ్, వైకుంఠంగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, స్వామి గౌడ్, ఎల్లా గౌడ్, కిషన్, భాస్కర్, రాము, కృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ శుభాకాంక్షలు

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్






నవతెలంగాణ-రాయపోల్

ఈద్-ఉల్-ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా చేసుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో రంజాన్ ఒకటి అని కొనియాడారు. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు. ఈ పవిత్ర మాసం దీక్షలు , ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్ధనలు సఫలం కావాలని, అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు. మరో సారి ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

'రంజాన్ ముబారక్' క్యాన్వాస్ చిత్రం ఆవిష్కరించిన రుస్తుం

నవతెలంగాణ-సిద్దిపేట

రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక రుస్తుం ఆర్ట్ గ్యాలరిలో ఆదివారం "నూరే ఈదుల్ ఫితర్ రంజాన్ ముబారక్ చిత్రాన్ని ప్రఖ్యాత అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు సమాజాలను కళావంతం చేస్తాయని, రంజాన్ పండుగ సోదరభావం, సహజీవనం, సామరస్యం, ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం, నైరూప్యచిత్రకారుడు సహీంరుస్తుం, మహ్మద్ రహీం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనారుస్తుం, మహ్మద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున ఆలయంలో అన్నసంతర్పణ కార్యక్రమం

నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఉగాది పండుగ పురస్కరించుకొని ఆదివారం స్వామివారికి అభిషేకం, బోనం, పట్నం, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులందరికీ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మల్లికార్జున స్వామి ఆశీస్సులు గ్రామస్తులుపై ఎల్లవేళలా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని సమృద్ధిగా వర్షాలు పడాలని స్వామి దయ వల్ల అందరు సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 31 మార్చి 2025 | www.navatelangana.com

తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

త్రైత సిద్ధాంతం వారి శ్రీవిశ్వావసు నామ సంవత్సర త్రైతశకం 47వ సం॥ తెలుగు ఉగాది కాలెండర్‌ను ఆదివారం హుస్నాబాద్‌లోని శివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామివారు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధానంగా రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత సారాంశం ఇందులో పొందుపరిచి స్వామి రచించడం జరిగిందన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి తయారు చేసిన ఇటువంటి గొప్ప కాలసూచికను అందించడం ప్రజలందరూ హర్షించదగ్గ విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సదా నిరంజన్ సిద్ధాంతి , శివనారాయణ సింగ్, వెంకట్, రాకేష్, సతీష్ చారి, రేవతి, రాణి, స్రవంతి, కల్పన, క్షేత్రజ్ఞ లు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



నవతెలంగాణ-సిద్ధిపేట

సీఎం సహాయ నిధి నుంచి అందించే ఆర్థిక సాయం నిరుపేద కుటుంబాలాకు వరం లాంటిదని కాంగ్రెస్ చిన్నకోడూరు మండలాధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. మండలంలోని కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన బైరెస్ లచ్చవ్వకు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేద కుటుంబలు అభివృద్ధి చెందుతాయాని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పర్శరాం, రాజేష్, ప్రశాంత్, జయంత్, గణేష్, వినోద్, నాగరాజు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఇప్పల సాయిలు కూతురు అకస్మాత్తుగా మరణించిందని, మాజీ సర్పంచ్ పాకాల కల్పన, బాబు తెలిపారు. ఈ సమాచారాన్ని ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలియజేయగానే మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని పంపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్కెర మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ పాకాల రవీందర్, యూత్ అధ్యక్షులు దుబ్బుడు శ్రీకాంత్ రెడ్డి, కె.సంపత్, శివ భరత్, సి.హెచ్ లక్ష్మణ్, గుండెల్లి సంపత్, ఎస్.ఐలయ్య, జె.చంద్రారెడ్డి, అనిల్ రెడ్డి, జెల్ల శ్రీనివాస్, మహేందర్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

మిర్దొడ్డి రామాలయ కమిటీ చైర్మెన్‌గా తోట కమలాకర్‌రెడ్డి

నవతెలంగాణ-మిరుదొడ్డి



మిడిదొడ్డి రామాలయం కమిటీ చైర్మెన్‌గా తోట కమలాకర్ రెడ్డిని కూడా జరిగింది. మండల కేంద్రంలో రామాలయం గుడి వద్ద ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సమావేశంలో అధ్యక్షతన తోట కమలాకర్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా కమ్మరి స్వామి, తోకల శ్రీనివాస్ రెడి, సంయుక్త కార్యదర్శిగా ధర్మారం మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కుంట రాజు, దార మల్లయ్య, కార్యదర్శులుగా నేరెళ్ల రాజు, కార్యవర్గ సభ్యులుగా బోయిన శ్రీనివాస్, తిరుపతి, మల్లేశం, బెక్కర్తి యాదయ్య, అంజిరెడ్డి, దుర్గయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఉగాది పర్వదిన సందర్భంగా మండలంలోని దేవాలయల వద్ద నూతన సంవత్సర పంచాంగ శ్రవణంను పూజారులు చదివి ప్రజలకు, భక్తులకు వినిపించారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేసినవారికి ఆలకించిన వారికి శుభం కలుగుతుందని తెలిపారు పూజారులు. ఋతువులు ప్రకారం వర్షాలు బాగా కురుస్తాయని దేశాన్ని ఆర్థిక అభివృద్ధి ఉంటుందని ఈ సంవత్సరం అన్ని రంగాల్లో బాగుంటుందని తెలియజేశారు. దీనిలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పంచాంగ శ్రవణం

-స్వామివారికి ఆదాయం 11 వ్యయం 11

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ శ్రవణంలో శ్రీ విశ్వాస నామ సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు పడి, పాడి పంటలు సుభిక్షంగా ఉంటాయని భూమంతా పచ్చదనంతో వర్ధిల్లుతుందని స్వామివారికి 11ఆదాయము, భక్తుల సౌకర్యాల కోసం ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధికి 11 వ్యయము అవుతుందని పండితులు తెలిపారు. ఈ సంవత్సరం విద్యా, వైద్య, భవన నిర్మాణ రంగాల వారికి చాలా శుభ సూచకంగా ఉందని పశుసంపదలో చాలా అభివృద్ధి ఉంటుందని, గత సంవత్సరంలో అందరూ అనుభవించిన బాధలన్నీ కూడా ఈ సంవత్సరం తీరుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, ఏ ఈ ఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.



చేరికలపైనే దృష్టి



చేరికలపైనే
గజ్వేల్ నియోజకవర్గం నేతల రాజకీయ భవిష్యత్ ఆధారపడి ఉందని, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్ని రాజకీయ పార్టీలు చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు లోకల్ బాడీ ఎన్నికలపై దృష్టి పెట్టి చేరికలను చేసుకుంటున్నాయి.

- చేరికలపైనే రాజకీయ భవిష్యత్తు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చెందిన సీనియర్ నాయకులు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ మరికొందరిని చేర్చుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. గజ్వేల్ మున్సిపల్ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నంలో ఉన్నారు. నియోజకవర్గంలోని 9 మండల పరిషత్తులు, జెడ్పీటీసీలు, 175 గ్రామపంచాయతీ ఎన్నికల్లో 80శాతం వరకు అధికార పార్టీ చేతిలో ఉండాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏ సమయంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికల సైరన్ మోగే అవకాశం ఉందని ఊహించిన అధికార పార్టీ నాయకులు ఇతర పార్టీల నాయకులపై గురి పెట్టారు. అదే స్థాయిలో బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి ఒంటేరు ప్రతాప్‌రెడ్డి తానేమి తక్కువ కాదని బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన చోటామోటా నాయకులు చేర్చుకుంట ఎన్నారు. ఇప్పుడున్న తాజా మాజీలు 80శాతం కేసీఆర్ పార్టీ చెందినవారు కాబట్టి తిరిగి వారందరినీ మళ్లీ గెలిపించుకొని అంతే శాతాన్ని దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

బీజేపీకి అనుకున్న స్థాయిలో క్యాడర్ లేకున్నా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి ఈటల రాజేందర్ రూ.65 వేల కోట్లు తీసుకురావడం వల్ల పార్టీకి కొంత కొత్త క్యాడర్ పుట్టుకొచ్చింది. నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను తమ ఖాతాలో వేసుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలతో..

గజ్వేల్ నియోజకవర్గం లో సీపీఐ (ఎం) ప్రజా ఉద్యమాలపై ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుంది. ఎన్నికల వచ్చినప్పుడే స్పందించాలని ఆ తరువాత ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఇతర పార్టీలకు సూచిస్తూ కార్మిక కర్షకుల సమస్యలపై ప్రభుత్వాలకు సూచిస్తుంది. పార్టీ ఆదేశిస్తే పోటీ చేయాలనే స్థానాల్లో ఆ దశగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు నియోజకవర్గంలో కొన్ని గ్రామపంచాయతీలను దృష్టిలో పెట్టుకున్నారు. అక్కడ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి.

బీసీ రిజర్వేషన్లు 42 శాతం నుంచి 56 శాతానికి పెంచాలి

-బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ నిసాని రామచంద్రం

నవతెలంగాణ-సిద్దిపేట

బీసీ రిజర్వేషన్లు 42 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ నిసాని రామచంద్రం ప్రభుత్వాన్ని కోరారు. బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ప్రెస్ క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బీసీల వ్యతిరేక పార్టీలని అన్నారు. ఈ దేశంలో మొట్టమొదటిసారి బీసీల రిజర్వేషన్ల కోసం పోరాడిన వ్యక్తి బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్సిరాం అని అన్నారు. బీసీల పక్షపాతిగా ఉన్న ఏకైక పార్టీ బీఎస్పీ పార్టీ మాత్రమే అని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సంతు నారాయణ సాహూ మహారాజ్, అంబేద్కర్ ఆలోచన విధాన్ని ముందుకు తీసుకుపోవడమే బహుజన్ సమాజ్ పార్టీ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకట్ , జిల్లా అధ్యక్షుడు కటికల ఓం ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లేశం ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, నాయకులు నరేష్, తిరుపతి, ఉమేష్, బాబు, రాజు, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, పోలీసుల దాడి

-సుమారు రూ.6వేల నగదు,4 ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సిద్దిపేట ట్రాన్స్ఫర్ సిబ్బంది పేర్కొన్నారు. ఆదివారంగజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కారం గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్న స్థావరం రైడ్ చేశారు. ఈ రైడ్‌లోనాలుగురుని అదుపులోకి వారి వద్ద నుంచి రూ.6వేల నగదు, 4 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నమన్నారు. ఈ రైడ్ లో మెతుకు శ్రీరాములు, పుట్ట రామరాజు, తిగుల్ వెంకట్ రాధాకృష్ణారెడ్డి, బోయిని స్వామి పట్టుబడ్డారన్నారు. అందరి నివాసం గణేష్ పల్లి మార్కుక్ మండలం వారన్నారు. గ్రామాలు, పట్టణాలు, ఫామ్ హౌస్‌లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం ఆడటం నెరమన్నారు. మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం అందించాలన్నారు. అలాంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కేరళ హై స్కూల్ విద్యార్థులకు అవార్డులు

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఏకలవ్య ఇంటర్ స్టేట్ ఒలంపియాడ్‌తో పాటు ఐఐటి స్టేట్ అవార్డులను అందుకున్నారు. హైదరాబాదులోని కొండాపూర్ టీసీసి క్లబ్‌లో శనివారం ఏకలవ్య స్కూల్ అన్యువల్ అవార్డ్స్‌లను విద్యార్థులకు ఫార్మర్ సీఈవో టెక్ మహీంద్రా బీపీఓ రంగినేని విజయ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ.. 9వ తరగతి చదువుతున్న పి.సాత్విక ఏకలవ్య ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్, ఐఐటి స్టేట్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. క్లాస్ స్టాపర్లుగా ఎల్ వైష్ణవి, ఆర్.శరత్ కుమార్, వి.సాయి హవిష్‌లు కూడా అవార్డులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ అల్లే శైలేందర్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, పేరెంట్ సంతోష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



మండలంలో వరుస చోరీలు..

-భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు..

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీ నగదును అపహరించుకు పోయారు. బేగంపేట గ్రామంలో ఫారుక్ ఇంటి ద్వారాలను దగ్దం చేశారు. స్థానికుడు మేరుగు రజనీకాంత్ తన ఇంటి వద్ద భద్రపరచిన బ్యాటరీ అపహరింకుపోయారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారు వాహన బ్యాటరీ అపసరించుకుని సుమారు 20 లీటర్ల డీజిల్ ఇందనం చోరి చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. బెజ్జంకి శివారులోని పోతారం రోడ్డులో చీలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద విద్యుత్ స్తంభాలను అమర్చిన విద్యుత్ సరఫరా తీగలు అపహరించు కుపోయినట్లు సమాచారం. ఆదివారం బేగంపేట గ్రామంలోని ఆనందయ్య ఆలయంలోని సౌండ్ సిస్టం అపహరణకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలో వరుసగా చోటుచేసుకున్న చోరి సంఘటనలపై అధికారులు స్పందించి కఠిన చర్యలు చేపట్టాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. సంటనలపై ఎస్ఐ క్రిష్ణారెడ్డిని వివరణ కోరగా ఆనందయ్య మఠంలో సౌండ్ సిస్టం అపహరణపై విచారణ చేపట్టామని..విద్యుత్ తీగల అపహరణ ఘటనపై ఏఈ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.



ఆర్యవైశ్య భవనంలో ఘనంగా పంచాంగ శ్రవణం

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఆదివారం ఉగాది పండుగ పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నందబాల శర్మ నేతృత్వంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద భారీ కాషాయ జెండాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాజా మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి మాట్లాడుతూ.. అందరికీ శ్రీ విశ్వావసు నామ ఉగాది సంవత్సర శుభాకాంక్షలు తెలిపి రాబోయే నూతన సంవత్సరంలో అందరూ బాగుండాలని కోరుకుంటూ పంచాంగ శ్రవణ కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్య నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ శివారులో క్రికెట్ పోటీలు ప్రారంభం

-యువకులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట: చదువులతో పాటు ఆటలపై యువకులు దృష్టి సారించాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మల్లన్న సాగర్ శివారులో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని భవిష్యత్ గెలుపు కోసం మలుచు కోవాలన్నారు. క్రీడలతో శారీరక దారు డ్యాంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. వెంకట్రావుపేటలో క్రికెట్ ఉన్నతి కోసం సహకారం అందిస్తున్నా లింగంపేట కోటి, పాత్కుల యాదగిరి, పోతరాజు స్వామి తదితరులను అభినందించారు. తన వంతు సహకారం అందిస్తామన్నారు. వెంకట్రావుపేటలో క్రికెట్ గ్రౌండ్ లేకపోవడంతో యువకులు తాత్కాలికంగా ఇక్కడ గ్రౌండ్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వెంకట్రావుపేట, కొల్గూర్, జప్తి లింగారెడ్డిపల్లి జట్ల మధ్య ట్రై సీరీస్ మ్యాచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు స్వామి గౌడ్, వెంకటేష్, పాత్కుల స్వామి, తదితరులు పాల్గొన్నారు.



సామాన్యుడి సంవేదనల అక్షరరూపం 'అలికిడి' పుస్తకం

నవతెలంగాణ-రాయపోల్

"కవిత్వం అంటే ఉత్సవం కాదు. గాయాల గొంతుకే" అంటారు ప్రము ఖ కవి నందిని సిధారెడ్డి. స్పందించే మనసున్న మనిషి నుండి జాలువారే అక్షరాలు కవిత్వంగా రూపుదిద్దు కుంటాయి. రాసిన ప్రతి వాక్యం సమాజాన్ని కదిలించకపోవచ్చు. కానీ సామాజిక చైతన్యం, సమాజం పట్ల బాధ్యత కలిగిన మనుషుల మనసు పొరలని మాత్రం తప్పక కదిలిస్తాయి. సమాజం పట్ల బాధ్యత కలిగి, తన స్పందనలని అక్షరాలలో బంధించి, కవిత్వంగా మల చిన యువ కవి కార్తీక రాజు పుస్తకం వెయ్యడానికి మాత్రం పురిటినొప్పులు పడ్డాడు. మొత్తంగా పుస్తకా న్ని మన ముందుకు తెచ్చి, తాను చెప్పదలుచుకున్న విషయాన్ని స్పష్టంగా మన కళ్ళ ముందుంచాడు. ఓ అరదశాబ్ద కాలం పాటు సోషల్ మీడియాలో రాసినవి కొన్ని, కవి సమ్మేళనాల కోసం రాసినవి కొన్ని, మనసు చలించే ఘటనలు జరిగినప్పుడు స్పందించి రాసినవి కొన్ని, ఇలా అన్నీ కలిపి 'అలికిడి' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చాడు కార్తీక రాజు.

ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా సాగిపోయే తన జీవితం లాగానే పుస్తకాన్ని కూడా ఓ నూ తన ఒరవడికి శ్రీకారం చుట్టి తీసుకువచ్చాడు. ప్రతి పుస్తకానికి ముం దుమాట ముఖద్వారంలా ఉంటుంది. కానీ ముందుమాట, కవిస్పందన లాంటివి ఏమీ లేకుం డానే కేవలం కవితలతో పుస్తకం వేయడం అంటే ధైర్యంతో కూడిన పని. 63 కవితలతో వేసిన ఈ పుస్తకంలో ఎన్నో అంశాలతో కూడిన కవితలున్నాయి. తన పొట్టకూటి కోసం మట్టిని నమ్మి, సమాజం ఆకలి తీరుస్తున్న రైతన్న గురించి మొదటి కవిత రైతు జీవన చిత్రం'లో పలవరిస్తాడు. "గిది మెతుకు కోసం పడే ఆరాటం/ బతుకు కోసం చేసే పోరాటం" అం టూ రైతు జీవన చిత్రాన్ని నిక్షిప్తం చేశాడు. యాం త్రీకరణ మూలంగా మాయమవుతున్న చాకిరేవు ఆత్మవేదనను 'చాకిరిబండ' కవితలో మన కళ్ళ ముం దు ఉంచాడు. తమ జీవితాన్ని ధారపోసిన తల్లి దండ్రుల త్యాగాన్ని స్మరిస్తూ 'అమృతం తాగని దేవతలు' అనే కవిత రాశాడు. ప్రపంచీకరణ మూలంగా ప్రాంతీయ మాతృభాషలు కనుమరు గవుతున్న తీరుపై కవి కలత చెంది 'ఆత్మ భాష' అనే కవిత రాశాడు. 'విశ్వ కీర్తినొందిన చిహ్నాలు' అంటూ ఓరుగల్లు ఆనవాళ్ళయిన కాకతీయ శిలాతోరణ ద్వారాల గురించి కవిత్వమల్లిండు. రోజురోజుకూ మానవత్వం మాయమవుతున్న తరుణంలో కవి 'అసహ్యంగా ఉంది' అనే కవిత రాశాడు. విద్యా వ్యవస్థలో గురువు స్థానం గురించి కార్తీక రాజు 'బజారు పాలైపోయింది' అన్న కవితలో తెలిపాడు. మనుషుల జాడ కోసం, మానవత్వపు నీడ కోసం పరితపిస్తున్నాడు ఈ కవి.





పుస్తకం: అలికిడి (వచన కవితల సంపుటి),
రచయిత: కార్తీక రాజు,